హృదయంలో హద్దులు

శివరాం యింటికి వచ్చి ఆలోచనలో పడినాడు.

ఆరుమాసాలనుండి తాను లాయర్ క్రిష్ణస్వామి దగ్గర కారు డ్రైవర్‌గా వుంటున్నాడు. ఆందోళన చెందవలసిన సంఘటన యెన్నడూ జరగలేదు. కానీ యీ నాడు తన యజమాని భార్య విపరీతంగా ప్రవర్తించింది.

యీ ఆరుమాసాలలో దాదాపు వందసార్లయినా ఆమెను కార్లో కూర్చో బెట్టుకొని తాను డ్రైవ్ చేసినాడు. అందులో ఒక యిరవై సార్లైనా ఆమెను ఒంటిగానే బజారుకో, స్నేహితురాండ్ర యిండ్లకో తీసుక పోయినాడు. యెప్పుడూ వెనుక సీటులో ప్రశాంతంగా కూర్చునేది. కారు యెక్కినా, దిగినా, లేక కారు ఆపమనిగానీ, కారు స్టార్టు చేయమనిగానీ తనతో ఒకటి రెండు మాటలు మాట్లాడినా, ఎప్పుడూ నిబ్బరంగా వ్యవహరించేది. తనతోనేగాదు — తనకు తెలిసి నంతవరకూ ఇంట్లో నౌకర్లతో గాని, బజార్లో షాపింగ్ చేసేటప్పుడుగాని ఆమె ఎప్పుడూ తొందరపాటు ప్రదర్శించనేలేదు. ఎన్నడూ ఏ ఆవేశానికీ లోనుగాకుండా, ఇంత ఆత్మ నిగ్రహంతో ఒక ఆడమనిషి వ్యవహరించడం తనకు తొలుత తొలుత ఆశ్చర్యంగానే వుండేది. కానీ, నెలకు వెయ్యిరూపాయలకు పైగా సంపాయించే భర్త, పిల్లలులేని సంసారం, యింట్లో తగినంత మంది నౌకర్లు, ఆమె మనశ్శాంతికి భంగం కలగవలసిన పని యేముంది — అని తానే సమాధానం చెప్పుకున్నాడు. పైగా సంస్కారమూ, ఔదార్యమూ కలవాడు లాయర్ క్రిష్ణస్వామి. ఆమె జీవితంలో ఆవేశాలు ప్రవేశించ వలసిన అవసరం రానేరాదు. ఆ భార్యా భర్తల వద్ద తన ఉద్యోగానికి

కూడా యెన్నాళ్ళున్నా యే ఒడుదుడుకులూ వుండవని ఒక అవ్యక్తమైన విశ్వాసం తన మనస్సులో క్రమంగా వృద్ధి చెందుతూ పచ్చింది.

లేక, ఆమెలో వున్నది నిస్సారమైన జీవితంమీద కలిగిన విరక్తి భావమేమో — అని కూడా తన కొకనాడు సందేహం కలిగింది. తన సందేహానికి తానే నవ్వుకొని తన్ను తానే ఖండించుకున్నాడు కూడా. ఆమె జీవితం నిస్సార మెందుకౌతుంది! యింకా ముప్ఫై యేండ్లు నిండని వయస్సు, యీడుకు తగిన భర్త, ఆరోగ్యం, ఐశ్వర్యం, క్లబ్బు, సినిమాలు, షికార్లూ, స్నేహితురాండ్రూ, ఆమెకు కోరదగినవన్నీ వున్నాయి. ఉన్నవాటి నన్నిటినీ అనుభవిస్తూనే వుంది. ఇక ఆమెకు జీవితంమీద విరక్తి అని అనుకోవలసిన కారణమేముంది? ఆత్మనిగ్రహం కలవాళ్ళ ఆనందం యిట్లే వుంటుందేమో, నిండుగా, నిబ్బరంగా, నిరావేశంగా అని అనుకున్నాడు తాను.

కానీ యీనాడు ఆమె విపరీతంగా ప్రవర్తించింది.

ఈ దినం సాయంత్రం ఆమెను యింటికి తీసుక వచ్చేటప్పటికి బాగా చీకటి పడింది. తాను కారు తలుపు తెరచి పట్టుకున్నాడు. ఆమె కారు దిగి మామూలు ప్రకారం యింట్లోకి వెళ్ళిపోకుండా అక్కడే నిలబడింది. తాను వినయంగా కారు తలుపు మూసే ప్రయత్నంలో వున్నాడు, ఆమె నిశ్శబ్దంగా తన భుజంమీద చేయివేసింది. తాను కంగారుపడి ఆమె ముఖంలోకి చూసినాడు. ఆమె తన కన్నుల్లోకి చూస్తూ మత్తుగా చిరునవ్వు నవ్వింది. తాను దిగ్భ్రాంతిలో మునిగిపోయినాడు. ఆమె కండ్లు మూసుకొని భారంగా ఊపిరి పీల్చుకుంది. దీర్ఘంగా నిట్టూర్చింది. తరువాత మెల్లగా యింట్లోకి వెళ్ళిపోయింది — అడుగులో అడుగు వేసుకుంటూ.

కొంతసేపటికి ఆ దిగ్భ్రాంతిలో నుండి తాను తేరుకొని, వెంటనే కారు షెడ్డులో పెట్టి, నేరుగా తన యింటికి వచ్చి ఆలోచనలో పడినాడు.

తీరా యిప్పుడు ఆలోచిస్తే, ఆమె ప్రవర్తన యీనాడే కాదు — వారం రోజుల నుండి యేదో వింతగా వుంది. పోయిన శనివారంనాడు ఆమెనూ క్రిష్ణస్వామినీ సినిమాకు తీసుకపోయినాడు తాను. వాళ్ళు సినిమా చూస్తూ వుండగా తాను థియేటర్ బయట కార్లో కూర్చున్నాడు. సినిమా యింకొక అర్ధగంటకు ఐపోతుందనగా ఆమె ఒక్కతే బయటకు వచ్చి కారులో కూర్చుంది. ఆమెను యింటి దగ్గర వదలిపెట్టి రావాలేమో అని తాను కారు స్టార్టు చెయ్యబోయినాడు. కానీ ఆమె వద్దు లెమ్మని చెప్పి, తల నొప్పిగా వుందని ఒక కప్పు కాఫీ తెచ్చి పెట్టమన్నది. యెదురుగా వున్న హోటల్ నుండి తాను కాఫీ తెచ్చి యిచ్చినాడు. కాఫీ త్రాగుతూ ఆమె యెన్నడూ లేనిది, ఆ దినమే మొదటిసారిగా, తన జీవితాన్ని గురించి పరామర్శించింది.

"మా దగ్గర నౌకరీ తృప్తికరంగా వుందా, శివరాం?" అని అడిగింది మొదట.

"నౌకరీ కేమైందమ్మా — నాకు చాలా హాయిగా వుంది" అని తాను తడువుకోకుండా జవాబు చెప్పినాడు. నిజంగా వున్న మాట గూడా అంతే. తాను యింతకు ముందు ఐదారుచోట్ల డ్రైవరుగా పని చేసినాడు. యెక్కడా యింత తృప్తిగా, హాయిగా వుండేది కాదు. వేళా పాళా లేకుండా డ్యూటీ చేయమనడమో, లేకపోతే యితర యింటి పనులు చేయ మనడమో, లేకపోతే తన్ను అగౌరవంగా నీచంగా చూడడమో, ప్రతి చోటా యేదో ఒక లోటు వుండేది. యిక్కడ మాత్రం యే లోటూ లేకుండా తన కన్నివిధాలా సంతృప్తికరంగా వుంది.

ఒక నిమిషం తర్వాత "నీకు భార్యా, పిల్లలూ వున్నారా?" అన్నది ఆమె.

"వున్నారమ్మా. భార్యా, యిద్దరు పిల్లలూ వున్నారు."

"మరి జీతం సరిపోతున్నదా?"

"సరిపోవడం యెక్కడికి లేండి. యింత మాత్రం జీతం గూడా లేనివాళ్ళు దేశంలో యెంత మంది వున్నారో" అన్నాడు తాను.

ఆ మాటకు ఆమె తియ్యగా నవ్వింది. నవ్వి, "ఉన్న వాళ్ళను చూసి ఈర్ష్యపడడంకంటె లేని వాళ్ళను చూసి తృప్తి పడడమే మేలు" అన్నది.

ఆ వ్యాఖ్యానం తన్ను విమర్శించడమా, అభినందించిడమా అన్న ప్రశ్న తన కప్పుడు తోచనేలేదు. ఈమె యెంత తియ్యగా నవ్వగలదు అనే ఆశ్చర్యంలోనే తాను మునిగిపోయినాడు. ఆ మాధుర్యానికి తాను పరవశుడై పోయినాడు. యిప్పు డాలోచిస్తే అందులో విమర్శగానీ, అభినందన గానీ లేదేమో అనిపిస్తున్నది. ఒక అసాధారణ అభిప్రాయం వెలిబుచ్చడం ద్వారా తన దృష్టిని ఆకర్షించడానికి చేసిన ప్రయత్నమేమో? ఆ తియ్యని నవ్వువెనుక కూడా తన్ను ఆకర్షించే వుద్దేశమే వుందేమో? తరువాత జరిగిన ఘటనలు ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నాయి.

ఆ ఘటన జరిగిన మూడు రోజులకు ఆమెను ఒంటిగా బజారుకు తీసుకపోవలసి వచ్చింది. పోయేటప్పుడు ఆమె వెనుక సీటులో నుండి తన వైపే చూస్తూ వుండినట్లు తన కెందుకో అనుమానం వచ్చింది. బజారులో పని ఐపోయిన తర్వాత బట్టల షాపులో నుండి బయటికి వస్తూనే మామూలు ప్రకారం వెనుక సీటులో కూర్చుంటుంది గదా అని తాను వెనుక తలుపు తెరచినాడు. కానీ ఆమె హఠాత్తుగా ముందు తలుపు తెరచుకొని

ఫ్రంటు సీటులో కూర్చొని, "పోదాం రా, శివరాం" అన్నది. తాను దిగ్భ్రాంతి చెంది ఆమె ప్రక్కనే డ్రైవర్ సీటులో కూర్చొని కారు స్టార్టు చేసినాడు. కారు కదలగానే "ఇదుగో, నీ భార్యకీ చీర తీసుక పో" అంటూ ఆమె తనమీద ఒక ప్యాకెట్ పడవేసింది. తాను ఒక చేత్తో స్టీరింగ్ చక్రం పట్టుకొని, మరొక చేత్తో ఆ ప్యాకెట్ తీసి ప్రక్కన పెడుతూ, "యెందుకమ్మా ?" అన్నాడు. ఆ మాట కూడా అనాలోచితంగా నోటికి వచ్చిందే. నిజానికి తానప్పుడు ఆలోచించే స్థితిలోనే లేడు. హఠాత్తుగా ఆమె ప్రక్కన కూర్చోవలసి వచ్చినందుకు తన మనసు తన స్వాధీనంలో లేదు. పైగా ఊహించని యీ బహుమానం ఒకటి.

"ఈ దినం నా పుట్టిన దినంలే శివరాం. మీ కుటుంబాని కిది బహుమాన మనుకో" అన్నది ఆమె తన పైపే చూస్తూ.

"ఐనా యెందుకమ్మా ?" అన్నాడు తాను, అంతకంటె యేమన డానికీ తోచక. అసలు ఆమె తనకు బహుమానం యివ్వడమే తనకేదో కించగా వుంది. బహుమానా లాశించడంగానీ, అందుకు తగిన వినయ విధేయతలు ప్రదర్శించడంగానీ తన జీవితంలో యింకా నేర్చుకోని విషయాలు. ఆ బహుమానం వలన తన ఆత్మాభిమానం యెక్కడో కొంచెంగా గాయపడింది. కానీ దాన్ని తిరస్కరించే సాహసం కూడా తనకు లేదు. యెంతైనా తాను ఆమె క్రింద నౌకరే.

"నీ భార్యమీద నీకా మాత్రం అభిమానం లేదా ?" అని ఆమె నవ్వింది. థియేటర్ దగ్గర నవ్వినంత కంటె తియ్యగా, అంత కంటె సుకుమారంగా నవ్వింది.

తాను ఉక్కిరి బిక్కిరై నోట మాట రాక అవస్థపడుతూ వుండగా, "లేక నీ భార్య నిన్ను అనుమానిస్తుందనా ?" అంటూ కిలకిల నవ్వింది.

ఆ నవ్వులో మాధుర్యమెంతో, మార్దవమెంతో తనకు తెలియదు కానీ, అది విన్న వాళ్ళకు మత్తెక్కించే నవ్వు. ఆ నవ్వు ఆగిన తర్వాత ఒక నిమిషం వరకూ తన చెవుల్లో మ్రోగుతూనే వుండింది. ఆ నిమిషం సేపూ కారు తన స్వాధీనంలో లేదనే చెప్పవచ్చు. తాను అంత సమర్థుడైన డ్రైవరై వుండి కూడా ఒకచోట యాక్సిడెంటు జరిగినంత పనైంది.

ఆ నాడు తన మనసులో యేదో తీవ్రమైన సంచలనం కలిగింది. కానీ అది యేమైందీ తనకే తెలియదు. ఆమెను గురించి యేమనుకోడానికీ తనకు తోచనేలేదు. ఆ రోజు రాత్రి ఆమెను గురించి కలగన్నాడు. ఆ కలలో ఆమె మళ్ళీ కిలకిల నవ్వింది. ఆ నవ్వు వింటూనే తనకు హఠాత్తుగా మెలకువ వచ్చి లేచి కూర్చున్నాడు. ప్రక్కనే వున్న భార్య ముఖం చూసి తాను పరస్త్రీలను గురించి కలగన్నందుకు సిగ్గుపడినాడు. ఆ సిగ్గు పడినప్పుడు అర్థమైంది — మనస్సులో ఆ సాయంత్రం కలిగిన సంచలనం యొక్క స్వభావం. తన యజమానురాలిని గురించి, ఆరు మాసాల నుండి యజమానురాలుగానే గాక సత్ప్రవర్తనగల ఉత్తమ వ్యక్తిగా తన గౌరవాన్ని చూరగొన్న స్త్రీని గురించి తానా విధంగా భావించడమే తప్పని తన్ను తాను నిందించుకున్నాడు. తన మనసులో యింత దుష్ట చింత వుందా అని ఆశ్చర్యపడినాడు. ఇటువంటి విషయాలలో ఒక్క తప్పటడుగు వేస్తే, యీ వుద్యోగం పోవడమే కాదు, మరెక్కడా ఇటువంటి ఉద్యోగం దొరకదని తనకు తానే భయం చెప్పుకున్నాడు.

కానీ యీ వారం రోజులలోనూ జరిగిన ఘటనలన్నీ కలిపి యిప్పుడు ఆలోచిస్తే, ఆమె వుద్దేశం స్పష్టంగా అర్థమౌతూనే వుంది. ఆ అర్థం కావడమే తన్ను యింత దీర్ఘాలోచనలో ముంచింది. ఆమె తన్ను కోరుతూ వుందనడంలో సందేహం యేమీ లేదు. కానీ — యెందుకు?

తన మీద ప్రేమా ? తనలో యేమి చూసి ప్రేమించింది ? అందంలో గాని, ఆకర్షణలో గాని, తాను క్రిష్ణస్వామి కంటె యోగ్యుడు కాడే ? లేక కేవలం పశుత్వమేనా ? యీ ఆరు మాసాల నుండి ఆమెలో తాను గమనించిన సత్ప్రవర్తన అంతా నటనేనా ? యేమో — యే పుట్టలో యే పాముందో ?

ఐనా, తనకు తానై ఒక వనిత వలచి వస్తే తనకెందుకు యింత ధర్మచర్చ ! తాను మాత్రం మనిషి కాదూ ! తానేమి శుకమహర్షిననో, ఋష్యశృంగున్ననో బోర్డు వేసుకున్నాడా !

ఈ ఆలోచనతో అతనికి నవ్వు వచ్చింది. తనలోతాను నవ్వుకుంటూ వుండగా, వంట యింట్లో నుండి అప్పుడే వచ్చిన భార్య "యీ రోజేమో వుల్లాసంగా వున్నారే !" అన్నది.

తాను వుల్లాసంగా వున్నమాట నిజమే. కానీ భర్తల వుల్లాసాన్ని భంగం చేసే హక్కు భార్యల కెవరిచ్చినారు ?

భార్యమీద విసుక్కుంటూ అతను భోజనానికి లేచినాడు.

*   *   *   *

ఆ సంవత్సరమంతా శివరాం ఆనంద వీధుల్లో విహరించినాడు. మనిషి జీవితంలో యింత సౌఖ్యం వుంటుందని అతనెప్పుడూ వూహించి యెరుగడు. తాను యిన్నాళ్లూ గడపిన జీవితమంతా నిస్సారం అనుకునే వాడు. స్త్రీ పురుషుల మధ్య యింత గాఢమైన వాంఛ, యింత మైమరపించే తన్మయత్వం, యింత అశాంతి కలిగించే ఆశ, యింత వేదన కలిగించే ప్రతీక్ష, యిదేనేమో కథల్లో ప్రేమ అని అనబడేది ! ప్రేమ ఐనా కాకపోయినా, తన జీవితానికి సార్థకత నిచ్చింది యిదే.

ఆమెతో పోలిస్తే తన భార్య మనిషేనా అని అతనికి అనుమానం వచ్చేది. ఈ భార్యలు అట్లా యెందుకు ప్రేమించలేరు? భార్యమీద అతనికి యేదో తృణీకారభావం, ఏదో నిరసనభావం కలిగేది. కాని మనసులో యెక్కడో భార్యమీద జాలి. పాపం – తనమీద నిష్కల్మషమైన విశ్వాసం చూపుతుంది. అమాయకురాలు – తానీ మధ్య యింటికి తెచ్చే బహుమానాలు చూసి ఉప్పొంగి పోతున్నది. తెలివి తక్కువది – తన్నింతవరకు అనుమానించనే లేదు, ఎన్నాళ్ళున్నా తన్ను అనుమానించదని అతనికి భార్యమీద ఒక వైపు అభిమానం; తెలివి తక్కువదని మరొకవైపు అవహేళన. ఇంత సమర్థంగా మోసగించగల తన తెలివితేటలను గురించి సగర్వమైన సంతృప్తి. తృప్తి చెందిన అహంకారం వలన అతను భార్య పట్ల మరింత ఉదారంగా ప్రవర్తించేవాడు; పిల్లలను మరింత ఆప్యాయంగా ఆదరించేవాడు.

* * * *

అతనికి అప్పుడప్పుడు ఆమెమీద విసుగు వచ్చేది. నాలుగైదు రోజుల కొకసారిగానీ తమ సమావేశాలు కుదిరేవిగావు. అవైనా ఆమె యేర్పాటు చేయవలసిందే కాని అతని యిష్టానిష్టాల ప్రసక్తి ఏమీ వుండేది కాదు. ఆమె కనిపించనినాడు మనసంతా ఆందోళనగా వుండేది. కలత నిద్రలో ఆమెను గురించే కలలు వచ్చేవి.

ఒకనాడు ఆమెను అడిగినాడు: "మన మిద్దరమూ యెప్పుడూ కలిసి వుండే మార్గం లేదా?"

"ఏం? యిప్పుడు తృప్తిగా లేదా?" అన్నది ఆమె.

"ఎప్పుడో వారాని కొకసారి కలుసుకుంటాము. తక్కిన రోజుల్లో మనసంతా నీ మీదనే. పగలంతా నిన్ను గురించిన ఆలోచనలే; రేయంతా నిన్ను గురించిన కలలే."

ఆమె నిశ్శబ్దంగా నవ్వింది. ఆమె తన మాట నమ్మలేదని అతను చిన్నబుచ్చుకున్నాడు.

ఆమె శాంతంగా జవాబు చెప్పింది : "పోనీ నీవు కోరినట్లు మన మిద్దరం కలిసి కాపురం చేస్తామనుకో. అప్పుడిక నన్ను గురించి ఆలోచనలూ రావు, కలలూరావు. ఆ స్థితిలో మనం కలసి వుండవలసిన అవసరం కూడా వుండదు."

సమాధానం తోచక అతను తల వంచుకున్నాడు.

ఆనాడు అతనికి మరొక విషయం గుర్తుకొచ్చింది. ఎన్నాళ్ళు గడచినా ఆమె మీద తనకేమీ అధికారం ఏర్పడ లేదు. ఆమె నిశ్చయ కంఠంతో మాట్లాడుతుంది; ఆమె మాటకు యెదురు చెప్పే శక్తి తన కుండదు. తన కామె తగినంత చనువివ్వలేదా ? ఆమె యజమానురాలన్న గౌరవభావం తన కింకా పోలేదా ? లేక — ఆమె వ్యక్తిత్వంలో ఏదైనా గొప్పతనం వుందా ? తనకు తన భార్య దగ్గర వున్న ఆత్మ విశ్వాసం ఆమె దగ్గర యెందుకుండదు ? భార్యకూ ఆమెకూ వున్న తేడా ఏమిటో యెంత ఆలోచించినా అతనికి అంతు చిక్కలేదు.

* * * *

హఠాత్తుగా శివరాం తలమీద పిడుగు పడినట్లైంది. "మనమింక కలుసుకోడానికి వీలుపడదు శివరాం" అన్నది ఆమె. ఒక నిమిషం సేపు అతని నోట మాట రాలేదు.

తరువాత మెల్లగా "యెందుకు ?" అన్నాడు.

"మనం కలుసుకోవడం మన కిద్దరికీ క్షేమం కాదు. నీ వీ వూరు వదలి యెక్కడికైనా పోవడం మంచిది."

దిగులుగా అతను ఆమె ముఖంలోకి చూసినాడు.

అతని దిగులు చూసి ఆమె చిరునవ్వుతో అన్నది : "అంత దిగు లెందుకమ్మా ? విడిపోవడ మంటే అంత బాధగా వుందా ?"

ఆ ప్రశ్న అతనికి విపరీతంగా కనపడింది. విడిపోవడం ఈమె కింత తేలికగా వుందా ? ఆమె కంఠంలోని ప్రశాంతత అతన్ని దెబ్బ గొట్టింది. ఆవేశంలో అతని కెన్నడూ కలగని సందేహం హఠాత్తుగా కలిగింది. ఆమె కన్నుల్లోకి తదేకంగా చూస్తూ, వణకుతున్న కంఠంతో అన్నాడు : "నీ కేమీ బాధలేదా ? నేను ప్రేమించినాను గనుక నాకు బాధగా వుంది. నీవు ప్రేమించ లేదు గనుక నీకు బాధగా లేదేమో ?.... అంతేనా ?"

ఆమె విషాదంగా చిరునవ్వి నవ్వింది. "మనం విడిపోతున్నామని ఒక బాధ, నేను బాధ పడలేదని మరొక బాధ, ఎన్ని బాధలు శివరాం నీకు ? నేను బాధపడలేదని యెందు కనుకున్నావ్ ? ఎంత బాధ ఐనా మనం విడిపోవడమే క్షేమం. ఆ మాట అన్నందుకు నీకెంత ఆగ్రహం!"

శివరాం మౌనంగా తల వంచుకున్నాడు. ఆమె మాటకు ఎన్నడూ ఎదురు చెప్పి యెరుగని తాను యీనాడు ఆమెను యెదుటనే నిందించినందుకు ఏదో తప్పు చేసినట్లు సిగ్గుపడినాడు. ఆమెను నిందించే అధికారం తనకే మున్నది ! ఆమె దగ్గర తాను నౌకరు. ఆ సంగతి తలచుకొని మరింత సిగ్గుపడినాడు.

ఆమె రెండు చేతులతోనూ అతని ముఖం పైకెత్తి జాలిగా అన్నది: "నేను నిన్ను ప్రేమించలేదనే అనుకో. అందువల్ల నష్టపడినదాన్ని నేనేగాని నీవు కాదుగా. నీవైనా నన్ను ప్రేమించినావు గదా ? అంతటి అపూర్వ అదృష్టం నీకు నా వల్లనే కదూ కలిగింది ? కృతజ్ఞత చూపకపోగా, నిందించడం కూడానా ?"

శివరాంకు కన్నుల్లో నీరు తిరిగింది. మెల్లగా అన్నాడు: "యిప్పుడు నన్ను పొమ్మనడం యెందుకు? కారణమైనా చెప్పవూ?"

"నా భర్తకు అనుమానం కలిగింది. ఆ బాధేదో నేనే పడతాను. నీవు వెళ్ళిపోతే నీకూ మంచిది, నాకూ సులభమౌతుంది." వానిటీ బాగ్‌లో నుండి ఒక పెద్ద కవరు తీసి అతని చేతిలో పెట్టి ఆమె అన్నది: "యీ ఐదువేలూ తీసుకొని పో. యెక్కడైనా వ్యాపారం చేసుకొని సుఖపడగలవు."

క్షీణకంఠంతో అతను అడిగినాడు: "యింత అభిమానం వున్న దానవు నా వెంట యెందుకు రాకూడదు? యీ డబ్బుతో మన మిద్దరమూ సుఖపడ లేమూ?"

"నీ కింకా పసితనం వదల్లేదు శివరాం," లాలనగా ఆమె జవాబు చెప్పింది. "నీ భార్యా బిడ్డల నేం చేస్తావో చెప్పు."

ఆ మాట వింటూనే అతను మళ్ళీ తల వంచుకున్నాడు. పిల్లలిద్దరూ జ్ఞాపకం వచ్చినారు. పిల్లలమీద మమకారం తెంచుకోడానికి తీవ్ర ప్రయత్నం చేస్తూ వుండగానే భార్య దీనవదనం యెదుట నిలిచింది. తాను పోతే తన భార్య యేమౌతుంది? యిద్దరు పిల్లలతో, నిరాధారంగా, నిస్సహాయంగా, అమాయకంగా, ఏకాకిగా — ఊహాకందని భయంతో అతని దేహం కంపించింది. యీ ఐదువేలతో తన భార్యకు అచంచలమైన అంగరక్షగా నిలబడవచ్చు. తన పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తు నిర్మించవచ్చు.

ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా గడచినాయి. బుజ్జగించే కంఠంతో ఆమె అన్నది: "వద్దు శివరాం. నీవు నీ భార్యాబిడ్డలను వదల్లేవు. నా భర్త ఐశ్వర్యాన్నీ, యీ సుఖాలనూ, యీ గౌరవ మర్యాదలనూ నేనూ

వదులుకోలేను. అంత త్యాగం నీకూ లేదు, నాకూ లేదు. నా అల్పత్వం యెక్కడుందో నాకు తెలుసు. ఈ క్షుద్ర సంస్కారాన్ని అధిగమించే సాహసం నాకు లేదు. సాహసం చేసినా నా సంస్కారం నన్ను సుఖ పడనివ్వదు."

సుకుమారమైన అనుతాపంతో నిండిన ఆమె కంఠం, ఎక్కడో మరో లోకం వైపు చూస్తున్నట్లున్న ఆమె చూపులు, అతనికంతా అపూర్వంగా వుంది. కన్నులు పెద్దవి చేసి ఆమె ముఖం వైపే చూస్తూ కూర్చున్నాడు. అతని కేదో మైకంలో వున్నట్లుంది.

ఒక నిమిషం తర్వాత అతని వైపు చూస్తూ తన మామూలు సరస మైన కంఠంతో ఆమె అన్నది: "యిక పోదాం పద. నీవు నన్ను మరచిపోకుండా మంచి చీర ఒకటి కొని యిస్తాను. నీ భార్య అది కట్టు కున్నప్పుడల్లా నేను జ్ఞాపకం వస్తుంటాను."

*   *   *   *

క్రీం కలర్ జార్జెట్ చీర భార్య చేతిలో పెట్టి శివరాం దిగులుగా కూర్చున్నాడు. అస్పష్టమైన ఆలోచనలతో, అవ్యక్తమైన వేదనలతో అతని మనసంతా బరువుగా వుంది.

కొత్త జార్జెట్ చీర కట్టుకొని భార్య యెదురుగా వచ్చి నిలిచింది. తన సొగసుకు తానే మురిసిపోతూ, "యెంతండీ యీ చీర? చాలా బాగుంది!" అన్నది.

ఆమె ఉత్సాహం చూసి అతని మనసులో విషాదమూ, వినోదమూ ముడివడినాయి. "మన మీ వూరు వదలిపోతున్నాము. అందుకని యీ చీర తెచ్చినాను – యీ వూరి జ్ఞాపకార్థం" అన్నాడు.

"యీ వూరికేమైందండీ? వదలిపోవడ మెందుకూ?" అన్నది

ఆమె ఆతుర్దాగా.

అతను గంభీరంగా జవాబు చెప్పినాడు : "అదృష్ట దేవత ఆజ్ఞ."

ఆ రాత్రి అతనికొక కల వచ్చింది. కలలో అతను వ్యాపారం చేసి డబ్బు సంపాయించినాడు. పెద్ద మేడ కట్టించినాడు. మరి కొన్ని లక్షలు సంపాయించినాడు. మేడమీద మరికొన్ని అంతస్తులు లేచినాయి. ఆదాయం పెరిగి పెరిగి అంతస్తులు ఆకాశం అంటినాయి. ఆకాశంలోని అప్సరస అతని చేతికి అందింది. అప్సరస కన్నుల్లోని రస పారవశ్యం అతనికి మత్తెక్కించింది. అప్సరసను గాఢంగా కౌగిలించుకున్నాడు. అప్సరస జారిపోతున్నట్లుంది. అతను మరింత గాఢంగా కౌగిలించుకున్నాడు. ఆ ఆవేశంలో అతనికి మెలకువ వచ్చింది. జార్జెట్ చీర మడుపుల మధ్య భార్య శరీరం అతని చేతులలో నుండి జారిపోతున్నది. మత్తుగా కండ్లు తెరచి, "కొత్త చీర నలిగిపోతుందండీ" అంటూ ఆమె గొణిగింది. ఆమె కన్నుల్లో అతనికి కన్పించింది నిద్ర మత్తు మాత్రమే.

కలలోని అప్సరస మామూలు మనిషిగా మారినందుకు అతనికి కించ కలిగింది. కానీ డబ్బును గురించి కలలు ప్రారంభమైనాయనే విషయం అతనింకా గుర్తించలేదు.

(డిశంబర్ 1959)